రక్షణ గోడ నిర్మాణానికి గ్రహణం!



- భూమి పూజ చేసినా ప్రారంభం కాని పనులు
- వర్షాకాలం రాకముందే నిర్మించాలని ప్రజల వేడుకోలు
- స్పందించని పాలకులు, అధికారులు

ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.ఒకటి కాదు రెండు కాదు ఏడు నెలలు గడుస్తున్నా నేటికీ ఒక ఇటుక అక్కడ వేయ లేదు. దీంతో ఆ ప్రాంత వాసులు ఎప్పుడు గోడ నిర్మాణ పనులు చేస్తారో అని ఆశగా ఎదురు చూస్తున్నారు. స్థానిక కూటమి నాయకులకు సంబంధిత కాంట్రాక్టర్ కొంత కమీషన్ రూపంలో ఇవ్వకపోవడం వల్లే ఈ పనులు నిలిచిపోయాయని ప్రచారం జరుగుతోంది.

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్ కొండ ప్రాంతంలో సుమారు 1300 మంది వరకు నివాసం ఉంటున్నారు. వర్షాలు భారీగా కురిస్తే కొండపై మట్టి చరియలు విరిగిపడడంతో బండ రాళ్లు దొర్లుకుంటూ దిగువన ఉన్న నివాసాలపై పడుతున్నాయి. దీంతో ఆ ఇళ్లల్లో ఉండే పేదలు భారీగా నష్టపోతున్నారు. కొంత మంది క్షతగాత్రులవుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గణపతినగర్ కొండ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి రూ.23 లక్షలు మంజూరు చేయించారు. ఈ పనులకు సంబంధించి భూమి పూజ కూడా చేశారు. దీనిలో భాగంగా నాడు కాంట్రాక్టర్ గోడ నిర్మాణం చేసే ప్రాంతాన్ని శుభ్రం చేశారు. కొలతలు కూడా తీసుకొని పనులకు సిద్ధమయ్యారు.ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచాయి.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కదలని వైనం

సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు మొదలు పెడతారని అని ఆ ప్రాంత వాసులు ఆశగా చూశారు. కారణం తెలియదు గానీ కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇది ఇలా ఉంటే ప్రస్తుత ఈ ప్రాంత నాయకులు (కూటమి పార్టీకి చెందిన వారు) పనులు మొదలు పెడితే తమ వాట సంగతి ఏంటి అని అడిగినట్టు తెలిసింది. వాటా సంగతి తేలిన తర్వాత పనులు మొదలు పెట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్టు ప్రచారం సాగుతోంది. ఇది ఇలా ఉండగా జీవీఎంసీ వర్క్ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను వివరణ కోరగా కొండ ప్రాంతం కావడంతో కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని,ఈ కారణంగా పనులు వాయిదా పడుతూ వస్తున్నాయని వివరించారు.


గణపతినగర్ కొండ ప్రాంతం

భయంగా ఉంది



మా గ్రామం కొండ ప్రాంతంలో ఉంటుంది. భారీ వర్షాలు వస్తే కొండ చరియలు విరిగిపడి ఇళ్లు దెబ్బతింటున్నాయి. ఎప్పుడు వర్షం కురిసినా భయం భయంగా జీవిస్తున్నాం. ఈ సమస్యను అధికారులు,పాలకులకు వివరించాం.వారు వచ్చి చూసి వెళ్తున్నారే తప్పా పనులు ప్రారంభం చేయలేదు.
–ఎం.అప్పలరాజు, గణపతినగర్ గ్రామ అధ్యక్షుడు

వర్షాలు కురిస్తే ఉండలేని పరిస్థితి



ఈ ఏడాది వర్షాకాలంలో కొండ ప్రాంత వాసులు బిక్కు బిక్కు మంటూ ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆ సమయంలో అధికారులు, నాయకులు వచ్చి కొండవాలు ప్రాంత ప్రజల రక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే నిధులు మంజూరైనా రక్షణగోడ పనులు ప్రారంభించడం లేదు. మళ్లీ వర్షాకాలం రాకముందే రక్షణ గోడ నిర్మించాలి. లేక పోతే కొండవాలు ప్రాంత వాసులకు ఇబ్బందులే.
– తాతారావు, స్థానిక నివాసి

తాళం వేసిన ఇళ్లే టార్గెట్!

- రెచ్చిపోయిన దొంగలు
- ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ


దొంగలు పగులగొట్టిన బీరువా


చెల్లా చెదురుగా పడేసిన ఇంట్లో వస్తువులు

విశాఖ విద్య: తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఒకే రోజు వరుసగా మూడు ఇళ్లల్లో చోరీ చేశారు. ఎయిర్‌పోర్టు క్రైం పోలీస్ స్టేషన్ పరిధి బుచ్చిరాజుపాలెం గవర వీధిలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు, బాధిత కుటుంబాల వారు తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చిరాజుపాలెం గవరవీధి రైల్వే ట్రాక్ సమీపంలోని మూడంతస్తుల భవనంలో వానపల్లి పోతురాజు, గంగాయమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో వారు నర్సీపట్నం వెళ్లారు. దీన్ని గమనించిన దొంగలు అర్ధరాత్రి తర్వాత తలుపు విరగొట్టి ఇంట్లో బంగారం, నగదు దోచుకెళ్లారు. అదేవిధంగా కింద పోర్షన్‌లో ఎవరు లేకపోవడంతో ఆ ఇంట్లో కూడా చొరబడి వెండి వస్తువులు అపహరించారు. అక్కడితో ఆగకుండా ఇంటి వెనకాల ఉన్న గ్రూప్ హౌస్‌లోకి ప్రవేశించి కింద పోర్షన్‌లో ఎవరూ లేకపోవడంతో గ్రౌల్లం విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. బెడ్ రూమ్‌లోని బీరువా విరగ్గొట్టి అందులో ఉన్న నగదు, బంగారం, వెండి దోచుకెళ్లారు. ఇంట్లో ఒక రూమ్‌లో కుక్క కట్టేసి ఉండడంతో రూమ్‌కు గడియ పెట్టారు. తెల్లవారుజామున గవర వీధిలో దొంగతనం జరిగిందని స్థానికులు గుర్తించి యజమానులకు సమాచారం అందించారు. దీంతో ఇళ్లకు వచ్చిన యజమానులు దొంగతనం జరిగినట్టు గుర్తించి ఎయిర్ పోర్టు క్రైం పోలీసులకు సమాచారం అందించారు. వెస్ట్ క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనాలు జరిగిన తీరును పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. పోతురాజు, గంగాయమ్మ ఇంట్లో 15 తులాల బంగారం ,రూ.7 లక్షల నగదు దొంగలు దొంగలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రూపు హౌస్‌లో నివాసముంటున్న ధనాల సత్యవతి ఇంట్లో అరతులం బంగారం, 18 తులాల వెండి పోయినట్టు ఫిర్యాదు చేశారు. దొంగతనం జరిగిన నివాసాల పరిసరాలను పరిశీలించారు. గతంలో జరిగిన దొంగతనాలు తీరు ప్రస్తుతం జరిగిన దొంగతనాల తీరు ఒకే విధంగా ఉండడంతో తెలిసిన వ్యక్తులు ఎవరైనా చేశారా..? లేక బయట నుంచి ఎవరైనా వచ్చారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బాక్సింగ్ విజేతలకు అభినందనలు


మెడల్స్ సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్‌లు, సభ్యులు

మల్కాపురం: ఇటీవల మచిలీపట్నంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ –14 బాల బాలికల స్టేట్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఎస్.హర్షిత (28 నుంచి 30 కేజీల విభాగం)పి.రోహిత్ (34 నుంచి 36 కేజీల విభాగం),ఏంజెలీనా (48 నుంచి 50 కేజీల విభాగంలో) ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు శనివారం గుల్లలపాలెం వాకింగ్ పార్కులో అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ బాక్సర్లు,మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన


గోపాలపట్నంలో అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

విశాఖ విద్య: జీవీఎంసీ 92వ వార్డు పరిధిలోని తోపుడు బళ్ల వర్తకులకు ప్లాస్టిక్ నిషేధంపై సచివాలయ సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. జనవరి 1నుంచి పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు వాడాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు వేస్తామన్నారు. పర్యావరణ పర్యారక్షణకు అందరు తమవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి మణికుమార్, తోపుడు బళ్ల యూనియన్ సభ్యులు, వర్తకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


సూచనలిస్తున్న ఆర్డీవో శ్రీలేఖ

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు ప్రక్రియను ఆర్డీవో శ్రీలేఖ శనివారం పరిశీలించారు. బుచ్చిరాజపాలెం, గోపాలపట్నం ఏరియాల్లో ఆమె పర్యటించారు. పోలింగ్ బూత్‌లలో విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. ప్రత్యేక శిబిరాలను ఆదివారం కూడా కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్


జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌కి అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం స్వామి ప్రసాదం, జ్ఞాపికలను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

పారిశ్రామిక వృద్ధికి వాల్‌చంద్ హీరాచంద్ కృషి ఎనలేనిది

సిప్‌యార్డు సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: దేశ నౌకా నిర్మాణ రంగానికి, పారిశ్రామిక వృద్ధికి సేఠ్ వాల్‌చంద్ హీరాచంద్ చేసిన కృషి ఎనలేనిదని షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి కొనియాడారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు స్వర్గీయ సేఠ్ వాల్‌చంద్ హీరాచంద్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఖత్రి ప్రసంగిస్తూ దేశ ప్రగతి పట్ల ఆయనకు ఉన్న ముందుచూపు పలువురికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. భారతదేశపు మొట్టమొదటి ఆధునిక షిప్‌యార్డ్, ఎయిర్‌క్రాఫ్ట్ ఫ్యాక్టరీ, ఆటోమొబైల్ ఫ్యాక్టరీని నిర్మించారని చెప్పారు. 100 ఏళ్ల కిందటే ఆత్మ నిర్భర్ భారత్‌ను అమల్లోకి తెచ్చిన గొప్ప దార్శనికుడని, భారతదేశం ప్రపంచంలోని ఇతరదేశాల కంటే మెరుగైన ఆర్థిక ప్రగతి సాధించిందంటే అందుకు ఆయన కృషి ఎంతో ఉందన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.


మాట్లాడుతున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

గుంతల పూడ్చివేత


ఎదురువానిపాలెం రోడ్డులో గుంతలు పూడ్చిన దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో వెనుక నుంచి ఎదురువానిపాలెం వెళ్లే సర్వీసురోడ్డులోని గుంతలను అధికారులు పూడ్చారు. ఈ మార్గం పిక్క తేలి అధ్వానంగా ఉండేది. ఈ సమస్యపై 'సాక్షి' దిన పత్రికలో ఈ నెల 21న సేవా మార్గం ఇలా.. ప్రయాణం ఎలా అనే శీర్షికన ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఎదురువానిపాలెం వెళ్లే సర్వీసురోడ్డులో మరమ్మతులు చేపట్టి గోతులను పూడ్చారు. దీంతో ఈ మార్గాన వచ్చే వాహనదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

పోరాటాలతోనే హక్కుల సాధన

మల్కాపురం: పోరాటాలతోనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సమస్యలపై స్పందిస్తాయని అఖిల పక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు భోగవల్లి నాగభూషణం,ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. కార్మిక,రైతులపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక ధోరణిని నిరసిస్తూ శనివారం అఖిలపక్షల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద నిరసన చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ కష్టపడితే పూట గడిచే కార్మికులను.. దేశానికి అన్నంపెడుతున్న అన్నదాతలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీ కరణ చేయబోమని ప్రకటించాలన్నారు. కార్మిక,రైతాంగ సమస్యలతో పాటు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో ఆదివారం పాతగాజువాక నుంచి కొత్తగాజువాక వరకు జరగనున్న నిరసన ర్యాలీలో కార్మికులంతా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న అఖిల పక్ష యూనియన్ నాయకులు

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

మల్కాపురం: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. జీవీఎంసీ 58,59,60వ వార్డుల పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఇంట్లో ఇద్దరూ కష్టపడి పని చేసినా జీవనం గడపలేమన్నారు. పెరిగిన నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీలతో ప్రజలు సతమతం అవుతుంటే కార్మికుల జీతాలు మాత్రం అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్‌వంటి విపత్తుల సమయంలో ప్రాణాలకు తెగించి శ్రమించిన కార్మికులకు ఇదేనా ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అని ప్రశ్నించారు. పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని లేకుంటే దీనిపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. పారిశుద్ధ్య కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు లక్ష్మణమూర్తి

అడ్డదిడ్డ పార్కింగ్‌తో అవస్థలు


గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారిలో నిలిచి పోయిన క్లాప్ వాహనం


తోటవీధిలో రహదారికి అడ్డంగా నిలిపిన వాహనాలు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57వ వార్డు కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట రైల్వేగేటు రహదారి నుంచి ఐటీఐ కూడలి భవానీగార్డెన్స్ రైల్వేట్రాక్ రహదారులకు ఆనుకుని ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతున్నారు. ఫలితంగా నిత్యం వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రైల్వే ట్రాక్, రహదారి గెడ్డకు ఆనుకుని రహదారిపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రతి నిత్యం వార్డులోని చెత్తచెదారాలు ఊడ్చే పారిశుద్ధ్య సిబ్బందికి, చెత్త తరలించే క్లాప్ వాహనాలకు ఇబ్బందిగా మారుతుందని పబ్లిక్‌హెల్త్ సిబ్బంది వాపోతున్నారు. ఆయా వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలకు, టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులకు ఫిర్యాదులు చేసినా అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జోన్-5 ఉన్నతాధికారులు ఆయా వార్డుల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని ప్రకటన చేయాలి

సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్

సీతమ్మధార: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 29న విశాఖ పర్యటన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందని ప్రకటించాలని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఈనెల 26న నిర్వహించనున్న కార్మిక కర్షక ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖలో అన్ని వర్గాల ప్రజలు 1,400 రోజుల నుంచి ఐక్యంగా పోరాడుతున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించకుంటే.. ఆంధ్ర రాష్ట్రానికి, తెలుగు ప్రజలకు తీరని ద్రోహం చేసినట్లేనన్నారు. నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మిక వర్గం, రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీన దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు భారీ ప్రదర్శన సభలు జరుగుతున్నాయన్నారు. విశాఖలో ఆ రోజు ఉదయం దొండపర్తి రైల్వే డీఆర్‌ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కార్మిక ప్రదర్శన సభ జరుగుతుందన్నారు. ఈనెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు పాత గాజువాక నుంచి కార్మిక ప్రదర్శన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎఫ్‌టీయూ కార్యదర్శి దేవ, సీఐటీయూ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, పి.వెంకట్ రెడ్డి, జి.అప్పలరాజు, పి.వెంకట్రావు, ఉరుకుటి రాజు, నూకరాజు, సింహాచలం , వి.వి.కష్టారావు అప్పారావు కుమారి పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న సీఐటీయూ నేత కుమార్

అప్పన్నకు డీఐజీ గోపీనాథ్ జట్టి పూజలు


ఆశీర్వచనం స్వీకరిస్తున్న డీఐజీ గోపీనాథ్‌జట్టి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జట్టి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ ఆయనకు అందించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

- వేడుకగా మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 49వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముందుగా కళాశాల వ్యవస్థాపకుడు సింగవరపు సూర్యారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాల స్వయం ప్రతిపత్తి పొందడం సంతోషకరమన్నారు. వచ్చే ఏడాదిలో కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోనుందని చెప్పారు. కళాశాల స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి.. కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా పి.సాయితరణి, వైస్ ప్రెసిడెంట్‌గా ఈవీఎస్ త్రివేణి ఎన్నికైనట్టు ప్రకటించారు. గత విద్యా సంవత్సరంలో అకడమిక్, క్రీడలు, సామాజిక సేవా రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగాయి. విద్యార్థినులతో కలిసి అధ్యాపకులు సందడి చేశారు.


సెల్ఫీలు తీసుకుంటూ సందడి


నిండుగా..రంగు రంగుల చీరలతో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైఎస్సార్‌టీయూసీ బలోపేతానికి కృషి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో వైఎస్సార్‌టీయూసీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని స్టీల్ ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ప్రధానకార్యదర్శి డి.వి.రమణా రెడ్డి అన్నారు. నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శనివారం రమణారెడ్డిని స్టీల్‌ప్లాంట్ యూనియన్ పాయింట్ వద్ద పలువురు సత్కరించారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో వైఎస్సార్‌టీయూసీకి పూర్వ వైభవం తెచ్చేలా ప్రయత్నిస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలు, ఆదేశాల మేరకు అఖిలపక్ష కార్మిక సంఘాలతో కలిసి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కర్రి దాలినాయుడు, డి. పుల్లారావు, శంకర్ సాయిరామ్, పేర్ల నూకరాజు, అండిబోయిన అప్పారావు, శశిభూషణ్, డి. అప్పలరాజు, నరశింగరావు, డి.వి.టి. రెడ్డి, తిప్పల గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.


నూతన ప్రధానకార్యదర్శి రమణారెడ్డిని అభినందిస్తున్న నాయకులు